క్లుప్తంగా

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త



కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ అటుగా వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటే భయపడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండడంతో భయాందోళలకు గురై తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు రాత్రి వేళల్లో వీధి కుక్కల అరుపులకు నిద్ర పట్టక ప్రజలు అవస్థ పడుతున్నారు. మూగజీవాలైన గొర్రెలు, మేకలపైన కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇళ్లలో పెంచుకుంటున్న కోళ్లను సైతం చంపి తింటున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడదను అరకట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ-పోస్టు ద్వారా శుభాకాంక్షలు



ఉదయగిరి: తపాల శాఖ ఈ-పోస్టు ద్వారా కేవలం రూ.12 ఖర్చుతో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలుపుకునే అవకాశాన్ని కల్పిస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ కోరారు. ఉదయగిరి సబ్‌పోస్టాఫీసు కార్యాలయ ఆవరణలో పోస్టల్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల శాఖ నిర్దేశించిన లక్ష్యాలను నూరు శాతం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు సేవల్లో భాగంగా గ్రూపు యాక్సిడెంట్ గార్డ్ పాలసీల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. సుకన్య సమృద్ధి, తపాల జీవిత బీమా యోజన పాలసీలను విరివిగా సేకరించాలన్నారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సాయికృష్ణారెడ్డి, ఎస్‌పీఎం బుర్రి చిన్నతిరుపాలయ్య, రఫి, నజీర్‌బాషా పాల్గొన్నారు.

పౌర సేవలు ప్రారంభమయ్యేనా?

ఆత్మకూరురూరల్: గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న 200కుపైగా పౌరసేవలు దాదాపు గత వారం రోజులు నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ పెద్దల సూచనల మేరకు అన్ని రకాల సేవలు అందించే సర్వర్లను పనిచేయకుండా నిలిపివేశారు. దీంతో విద్యార్థుల నుంచి రైతుల వరకు ధ్రువీకరణపత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. పంట రుణాలు పొందేందుకు రైతులు బ్యాంకులకు తాజా 1బీ, అడంగల్‌ను అందజేయాల్సి ఉంటుంది. విద్యా సంవత్సరం గురువారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను పాఠశాలల్లో ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో మీసేవ ద్వారా ప్రజలకు పౌర సేవలు అందించేవారు. వాటిని ఇటీవల సచివాలయాల ద్వారా అందిస్తుండడంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంది. టీడీపీ గెలిచాక అన్ని రకాల సర్వర్లను పనిచేయకుండా నిలిపివేయడంతో పౌరసేవలు నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం బుధవారం కొలువుదీరిన నేపథ్యంలో సర్వర్లను మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారో, పౌర సేవలు ఏ విధంగా అందిస్తారోనని సంబంధిత వర్గాల వారు ఎదురు చూస్తున్నారు.

లైసెన్సులను రద్దు చేస్తాం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు వేస్తున్న రైతులను గుర్తించి వారి లైసెన్సులను రద్దు చేస్తామని బుచ్చిరెడ్డిపాళెం ఎఫ్‌డీఓ పొట్టెయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన బుచ్చిరెడ్డిపాళెంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపల సాగు చేస్తున్న రైతులు వాటికి మేతగా చికెన్ వ్యర్థాలు వేస్తున్నారన్నారు. దీనివల్ల దుర్గంధం వెదజల్లుతుండడంతో సమీప గ్రామాల ప్రజలు అవస్థ పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై తమ సిబ్బందితో కలిసి నిత్యం గ్రామాల్లో పర్యటించి చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి లైసెన్సులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. చికెన్ వ్యర్థాలను తీసుకొస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందుకు గ్రామస్తులు కూడా సహకారం అందించాలని, చికెన్ వ్యర్థాలు వేస్తున్న వారి వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇప్పటికైనా చేపల గుంతలు సాగు చేస్తున్న రైతులు చేపలకు ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేయకుండా ప్రత్యామ్నాయ ఆహారాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు.

మోగింది..బడి గంట

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- కార్పొరేటు హంగులతో ప్రభుత్వ బడులు
- పంపిణీకి సిద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు(ఫైల్)



ఆధునిక హంగులతో జలదంకిలోని ప్రాథమికోన్నత పాఠశాల

ఉదయగిరి: నేటి నుంచి బడిగంట మోగనుంది. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభంకానున్నాయి. 50రోజుల పాటు సెలవుల్లో సరదాగా గడిపిన విద్యార్థులు ఆటపాటలకు గుడ్‌బై చెప్పారు. మళ్లీ బడి బాట పట్టేందుకు మూలన పడేసిన పుస్తకాల సంచులను సిద్ధం చేసుకోవడంలో తలమునకలయ్యారు. మరోవైపు ఉపాధ్యాయులు పాఠశాలలను తెరిచి గదులు, పరిసరాలను శుభ్రం చేయించే పనిలో నిమగ్నమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద పాఠశాలల్లో ఆధునిక వసతులు సమకూరాయి. దీంతో ప్రభుత్వ బడులు కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా అన్ని వసతులతో కళకళలాడుతున్నాయి.

బడి బాటలో విద్యార్థులు

ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 256 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 26,635 మంది విద్యార్థులు ఉన్నారు. బడులు తెరిచిన తర్వాత కొత్తగా చేరే విద్యార్థులతో పాటు ఒకటో తరగతిలో చేరే విద్యార్థుల సంఖ్య మరో వేయి వరకు ఉండే అవకాశం ఉంది. కొత్త విద్యార్థులను బడుల్లో చేర్పేందుకు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

వసతులతో విద్యార్థులు ఫుల్

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి సకల వసతులతో కార్పొరేటు విద్యా సంస్థలను తలదన్నేలా వాటి రూపురేఖలను మార్చారు. దీంతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులతో ఆధునిక విద్యా బోధన, ఇంగ్లిష్ మీడియాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకు పంపుతున్నారు. దీంతో ప్రభుత్వ బడులు కిక్కిరిస్తున్నాయి. అంతే కాకుండా ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, టై, బెల్టు, బూట్లు, యూనిఫామ్ అందజేస్తున్నారు. మధ్యాహ్నం రుచికరమైన భోజనంతో పాటు అల్పాహారం కింద చిక్కిలు ఇస్తున్నారు. మంచి చదువుతో పాటు పౌష్టికాహారం అందిస్తుండడంతో విద్యార్థులు సర్కారు బడుల వైపు మొగ్గుచూపుతున్నారు. దీనికి తోడు జాతీయ ఉపకారవేతనం, ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందే అవకాశం కూడా లభిస్తుండడంతో ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు అధికంగా ఉన్నాయి.

ఉదయగిరి నియోజకవర్గ సమాచారం

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు – **256**
మొత్తం విద్యార్థుల సంఖ్య – **26,635**
మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య – **1435**

ప్రైవేట్‌కు ధీటుగా..



గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ బడుల్లో అన్నీ రకాల సౌకర్యాలు కల్పించారు. దీంతో కార్పొరేటు బడులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఫ్యాన్లు, బల్లలు, మినరల్ వాటర్ ప్లాంట్స్, తదితర సౌకర్యాలతో పాటు చదువుకునేందుకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ బడులకు తమ పిల్లలను పంపుతున్నారు.

– బాషా, గండిపాళెం

ఉచితంగా నాణ్యమైన విద్య



ప్రభుత్వ బడుల్లో అన్నీ రకాల వసతులు ఉన్నాయి. విద్యా కానుక కిట్లు ఇస్తున్నాం. ఉచితంగా నాణ్యమైన విద్యతో పాటు పుస్తకాలు అందిస్తున్నాం. మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. దీంతో ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ బడులే మెరుగ్గా ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలి.

–తోట సుబ్బారావు, ఎంఈఓ–2, ఉదయగిరి

దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సైమన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15లోగా పాఠశాలలో విద్యార్థులు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఈ నెల 20వ తేది ఉదయం పది గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

ఇదేమి జాడ్యం!



బిట్రగుంట: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించిన తరువాత ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు శాసన వ్యవస్థలను శాసించేలా సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాలను కాలరాసేలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దిచక్ర వాహనాలకు నంబరు ప్లేట్లను తొలగించి వాటి స్థానంలో 'ఫలానా ఎమ్మెల్యే గారి తాలుకా' అంటూ బోర్డులు పెట్టుకుంటున్నారు. దీన్ని ఇప్పటి వరకు కనీవిని ఎరగని ప్రజలు ఇదేమి జాడ్యమంటూ నివ్వెరపోతున్నారు. బైక్ నంబరు ప్లేటు తొలగించి 'కందుకూరు ఎమ్మెల్యే గారి తాలుకా' అని బోర్డు పెట్టుకున్న బైక్ కావలిలో బుధవారం ఇలా కనిపించింది. ఇటువంటి వాళ్లపై 'చట్టం తాలుకా ప్రతినిధులు' ఏ విధంగా స్పందిస్తారో చూడాలి మరి.

బాల కార్మికులను బడిలో చేర్పించండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి

అనుమసముద్రంపేట: 14ఏళ్లలోపు బాలలను బడిలో చేర్పించి బాల కార్మిక వ్యవస్థను అంతం చేయాలని ఏఎస్‌పేట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు డీఎస్పీ ఎన్ కోటారెడ్డి పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని హెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏఎస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాలలతో పనులు చేయించడం నేరమని, 14 ఏళ్లలోపు పిల్లలను బడికి మాత్రమే పంపాలని తెలిపారు. బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. బాలలు ఎక్కడైనా పనిచేస్తుంటే 1098 లేదా 100కు తెలియజేయాలని కోరారు. కాగా బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హెడ్‌స్వచ్ఛంద సంస్థ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆత్మకూరులో డీఎస్పీ ఎన్ కోటారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెడ్స్ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలి



చింతలపాళెంలో అవగాహన కల్పిస్తున్న మాలకొండారెడ్డి

జలదంకి: బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి కోరారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చింతలపాళెం గిరిజన కాలనీలో బాల కార్మిక చట్టంపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు బాల కార్మిక చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. గిరిజన బాలబాలికలు బయట తిరగకుండా పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యతోనే గిరిజనుల తలరాతలు మారుతాయన్నారు. గిరిజన పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని సూచించారు. అనంతరం గిరిజన చట్టాలపై అవగాహన కల్పించారు. గిరిజనులు రమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెంలో సీతారాముల ఉత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాములను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాణాన్ని వీక్షించారు. గ్రామానికి చెందిన చంద్రా హజరత్ నాయుడు, మోనిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం గరుడ వాహనంపై సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

దుత్తలూరు: గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి అని హెల్త్ సూపర్‌వైజర్ షేక్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. మండలంలోని సోమలరేగడ సచివాలయంలో బుధవారం నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం వైద్యారోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. క్షయ వ్యాధి నిర్మూలనకు వయోజనులకు అడాల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను సోమ, గురువారాల్లో వేయాలని సూచించారు. పిల్లల ఎత్తు, బరువులను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని తెలిపారు. తీవ్ర పోషకాహారలోపంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి నెల్లూరు న్యూట్రిషన్ రీహ్యాబిలిటేషన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే పిల్లలతో ఐరన్, ఫోలిక్ యాసిడ్ సిరప్‌లు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎన్ చంద్రావతి, అంగన్‌వాడీ టీచర్ డీ లక్ష్మమ్మ, ఆశాకార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

వారానికి రెండ్రోజులు బీసీజీ వ్యాక్సినేషన్



సీతారామపురం: అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు స్వప్నారెడ్డి

సీతారామపురం: ఇక నుంచి వారానికి రెండుసార్లు సోమ, గురువారాల్లో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి స్వప్నారెడ్డి తెలిపారు. బుధవారం ఆమె బీసీజీ వ్యాక్సినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తోందని తెలిపారు. మండలంలోని 60 ఏళ్లుపైబడిన వారితో పాటు 18 ఏళ్లు నిండిన షుగర్ వ్యాధిగ్రస్తులు వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు మండలంలో 1300 మందికి బీసీజీ టీకా వేశామని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

వరికుంటపాడు: మండలంలోని రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను బుధవారం అందజేశారు. వైద్యాధికారిణి కరీష్మా 33 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగాలైన బీపీ, మధుమేహంతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు మింగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి పరామర్శ



సంగం: సంగానికి చెందిన చేనేత కార్మికుడు ఆనంద్ కుటుంబ సభ్యులను చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ బుధవారం పరామర్శించారు. ఆనంద్ మృతిపై కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆనంద్ కుటుంబానికి నిలువ నీడ లేదని,కటిక పేదరికంలో ఉన్న ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆనంద్ కుటుంబంలో చదువుకున్న ఇద్దరు ఆడ బిడ్డలు ఉన్నారని, వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



ఉదయగిరి: మండలంలోని నేలటూరు పంచాయతీ పరిధిలోని సర్వరాబాదులో ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి పదో వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి రెవ.కే జయరావ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. అనంతరం దైవ సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితం చెట్టు కింద ప్రారంభమైన చర్చి కార్యకలాపాలను నేడు అధునాతన భవనంలో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఏసుదాస్, లాజరస్, సంఘపెద్ద గొల్లపల్లి సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం గొల్లపల్లికి చెందిన పలువురు బుధవారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీజేపీ మండలాధ్యక్షుడు గుండాల విజయభాస్కర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొమ్మల పెంచలయ్య, ప్రసాద్, నరసింహులు, తదితరులు ఉన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య, కుంకు బాలయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా హనుమాన్ శోభాయాత్రను బుధవారం వేడుకగా నిర్వహించారు. 200 మంది భక్తులు బైకులపై కోనేటిసెంటర్ నుంచి అల్లూరుపేట సత్రం వరకు, తిరిగి అక్కడి నుంచి కోనేటి సెంటర్ వరకు శోభాయాత్ర సాగించారు. ఈ సందర్భంగా శ్రీరామ, హనుమాన్ నామస్మరణతో పరిసరాలు పులకించాయి. కాగా వార్షిక వేడుకల్లో భాగంగా గురువారం విశేష పూజలు, హోమాలు, భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

అల్లూరు: ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేందుకు సబ్‌రిజిస్ట్రార్లు కృషి చేయాలని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు అన్నారు. అల్లూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ప్రభుత్వం అల్లూరు సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రూ.7.68 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించగా, రూ.5.61 కోట్లు మాత్రమే సాధించడం జరిగిందన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని సాధించలేక పోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నూతన ప్రభుత్వంలో జరిగే అభివృద్ధి, ప్రాంతాల ఆధారంగా మార్కెట్ విలువలను పెంచి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది వంశీకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు



ఉదయగిరి: హెచ్‌ఎంలకు యూనిఫామ్ అందజేస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు



సీతారామపురంలో..



సోమశిల: అనంతసాగరంలో..

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్లను బుధవారం తరలించారు. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి హెచ్‌ఎంల ద్వారా స్టూడెంట్ కిట్లను పాఠశాలలకు తరలించినట్లు ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు తెలిపారు. తల్లిదండ్రుల కమిటీల సమక్షంలో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకేశవులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీం, సీఏ వశీం, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని 58 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన పుస్తకాలు, యూనిఫామ్‌లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓలు షావుద్దీన్, రమణారెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 21,000 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా, మొదటి విడతగా 4,667 వచ్చాయని తెలిపారు. వీటిని విద్యార్థులకు పాఠశాలలు తెరిచే రోజునే పేరెంట్స్ కమిటీల ద్వారా అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సీతారామపురం: మండలంలోని 40 పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌తో పాటు 1899 స్టూడెంట్ కిట్లను ఆయా పాఠశాలలకు ఎంఈఓ మస్తాన్‌వలి బుధవారం తరలించారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తుగా ఈ సామగ్రిని ఆయా పాఠశాలలకు తరలించారు. మరో రెండ్రోజుల్లో విద్యార్థులకు బ్యాగులు, షూలు అందించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సోమశిల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్లను ఆయా పాఠశాలలకు ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. అనంతసాగరం ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి సీఆర్పీల ద్వారా పాఠశాలలకు కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.